పొలం గట్లకు పాలిథిన్ షీట్లు

- సాగునీటి సంరక్షణకు రైతుల ఎత్తుగడ
- ఎలుకల బెడదకు అడ్డుకట్ట
- తెగుళ్ల వ్యాప్తి నివారణ



గణపవరంలో చేలో నీరు బయటకు వెళ్లకుండా గట్టుపై ఏర్పాటుచేసిన పాలిథిన్ షీట్లు

గణపవరం: ఏటా దాళ్వాలో వరిసాగుకు సాగునీటి ఎద్దడి రావడం సహజం. ఇక శివారు భూములు, మెరక భూముల్లో వరి సాగుచేస్తున్న రైతులు నీటి కోసం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఉన్నకొద్దిపాటి నీటిని పూర్తిస్థాయిలో సాగుకు వినియోగించుకోవలసి ఉంటుంది. చేలో ఉన్న కొద్దిపాటి నీరు గట్లు బలహీనంగా ఉన్నా, గట్టుపై ఎలుక బొరియలు ఉన్నా ఆ నీరు బయటకు పోతుంది. ముఖ్యంగా పంట చివరి దశలో రైతులకు నీటి సమస్య ఎక్కువగా ఉంటుంది. ఇలాంటి పరిస్థితులు నివారించేందుకు రైతులు సరికొత్త పద్ధతులు అవలంభిస్తూ నీటిని ఒడిసి పట్టి పంటకు వినియోగించుకుంటున్నారు. వరి పొలం చుట్టూ ఉండే గట్లను పూర్తిగా పాలిథిన్ షీట్లతో కప్పి వేస్తున్నారు. దీని వల్ల పొలంలో చుక్కనీరు కూడా బయటకు లేదా సమీప పొలాల్లోకి, దిగువకు పోకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. గట్లకు పాలిథిన్ షీట్లు ఏర్పాటు చేసిన పొలానికి నీరు పెడితే కనీసం పది రోజుల వరకూ తడి అందించకపోయినా ఎలాంటి ఇబ్బంది ఉండటంలేదని రైతులు చెబుతున్నారు. దీనికి తోడు పొలంలో ఎరువులు, పురుగు మందులు వేసినా నీరు బయటకు వెళ్లకపోవడం వల్ల రైతుకు నష్టం ఉండదు. ఎకరాకు అదనంగా రూ.3 నుంచి 5 వేలు పెట్టుబడి పెరిగినా పంటకు నీటి సమస్య రాకుండా ఇలాంటి పాట్లు తప్పడం లేదని రైతులంటున్నారు. ముఖ్యంగా గణపవరం, సరిపల్లె, కొత్తపల్లి, కొందేపాడు తదితర శివారు భూములు, కాస్త మెరక భూముల రైతులు నిత్యం ఇంజన్లతో నీరు తోడుకుంటుంటారు. ఈనీరు వృథా కాకుండా ఇలా కొందరు చేల గట్లపై ప్లాస్టిక్ షీట్లు కప్పుతున్నారు.

సాగు నీరు వృథా కాదు



పొలం గట్ల మీద పాలిథిన్ షీట్లు కప్పడం వల్ల సాగునీటి వృథాను అరికట్టవచ్చు. ప్రస్తుత కాలంలో దాళ్వాకు నీటి కొరత ఏర్పడింది. ఇప్పటికే వంతుల వారీగా సాగునీరు విడుదల చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కాస్త పెట్టుబడి అయినా పొలం గట్ల బొరియల గుండా నీరు బయటకు పోకుండా ప్లాస్టిక్ షీట్లు కాపాడుతున్నాయి. గట్ల మీద పచ్చగడ్డి పెరగదు. దీనివల్ల తెగుళ్ల వ్యాప్తి తగ్గుతుంది. గట్ల వెంబడి ఎలుకలు బొరియలు పెట్టకుండా ప్లాస్టిక్ కవరు అడ్డుపడుతుంది.

– నౌడు మేల్లశ్వరరావు, రైతు

లారీ స్టాండ్ల అభివృద్ధికి స్థలాల పరిశీలన

దెందులూరు: మండలంలోని సింగవరం, కొత్తగూడెం గ్రామాల్లోని లారీ స్టాండ్ల స్థలాలను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ పరిశీలించారు. ప్రముఖ కంపెనీ హెచ్‌సీఎల్, నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా సంయుక్తంగా లారీల స్టాండ్‌ను అభివృద్ధి చేసేందుకు నిర్ణయం తీసుకున్నట్లు ఆయన అన్నారు. దీనిలో భాగంగా రెండు గ్రామాల్లోని లారీ స్టాండ్లను కలెక్టర్ పరిశీలించారు. సింగవరం, కొత్తగూడెంలో ఎన్ని ఎకరాల విస్తీర్ణంలో భూమూలున్నాయి, వాటి సరిహద్దులు, ఇతర సమస్యలు ఏమైనా ఉన్నాయా అంటూ తహసీల్దార్ ఎన్వీ నాంచారయ్యను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రెండు స్టాండ్ల సర్వే నంబర్లు, సరిహద్దులు ప్రస్తుత స్థితిని తహసీల్దార్ నాంచారయ్య కలెక్టర్‌కు వివరించారు. హెచ్‌సీఎల్, నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా సంయుక్తంగా అభివృద్ధి చేసే బృహత్తర కార్యక్రమమని వివరించారు. తహసీల్దార్ వెంట కొత్తగూడెం సర్పంచ్ పరసా లక్ష్మీ సుజాత, గ్రామ పార్టీ అధ్యక్షుడు కోటీపల్లి సురేష్, వైఎస్సార్ సీపీ నాయకులు రాము, వీఆర్‌ఓ రామచంద్రరావు ఉన్నారు.

క్లుప్తంగా

25 నుంచి ఏపీ మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రం ప్రారంభం



మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రంపై చర్చిస్తున్న మండల ఏఓ రమేష్, తహసీల్దార్ ఎన్వీ నాంచారయ్య

దెందులూరు: ఈ నెల 25 నుంచి దెందులూరు కోఆపరేటివ్ సొసైటీ కార్యాలయంలో ఏపీ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రం ప్రారంభించనున్నట్టు ఏఓ గద్దె రమేష్ అన్నారు. మంగళవారం దెందులూరు తహసీల్దార్ ఎన్వీ నాంచారయ్య, ఏఓ కలిసి చర్చించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ క్వింటా మినుములు రూ. 6,600, క్వింటా పెసలు రూ.7,750 ధరలను మార్క్‌ఫెడ్ రైతుల నుంచి కొనుగోలు చేస్తామన్నారు. రైతులు తొందరపడి దళారుల మాటలు విని తక్కువ ధరకు అపరాలను ఇతర చోట్ల విక్రయించవద్దని సూచించారు.

నేడు బాపట్ల ఎంపీ సురేష్ కొవ్వలివారిగూడెం రాక



ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరితో మాట్లాడుతున్న మేధినరావుపాలెం సర్పంచ్, తదితరులు

దెందులూరు: వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు, బాపట్ల ఎంపీ నందిగం సురేష్ బుధవారం కొవ్వలివారిగూడెం విచ్చేస్తారని మేధినరావుపాలెం సర్పంచ్ ఎం.దుర్గాకుమారి రాజు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరికి తెలిపారు. మంగళవారం ఎమ్మెల్యే కార్యాలయంలో మేధినరావుపాలెం నాయకులు మేడికొండ రాజా, జొన్నకూటి మంగారావు, తాడిగడప వెంకటేశ్వరరావు ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరిని కలిసి గ్రామానికి రావాలని ఆహ్వానించారు. ఎంపీతో పాటు తాను కూడా వస్తానని సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకులకు ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి తెలిపారు.


మహనీయుల జీవిత చరిత్రలు చదవండి



కాగుపాడు హైస్కూల్లో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రతినిధులు

ఉంగుటూరు: విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని సాధన కోసం ఇష్టపడి, కష్టపడి చదవాలని వ్యక్తిత్వ వికాస నిపుణుడు తాడేపల్లి మోహనరావు అన్నారు. మంగళవారం కాగుపాడు, కైకరం హైస్కూల్లో పదో తరగతి విద్యార్థులకు వ్యక్తి త్వ వికాసంపై, కెరియర్ గైడెన్సుపై తరగతులు నిర్వహించారు. మానవత లయన్సు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆ రెండు సంస్థల మండల ప్రతినిధులు పుప్పాల గోపి, సూర్యనారాయణరాజు, శీతాల సత్యనారాయణ, అడపా శోభాఱాణి, హెచ్ఎంలు ఉమాదేవి, చేబ్రోలు శ్రీనివాసరావు, వంకిన ప్రతాప్, గుణ్ణంబుల్లిఅబ్బాయి, పుసులూరి ప్రకాష్, కడియాల చిట్టిబాబు పాల్గొన్నారు.

సర్వే ప్రారంభం



నారాయణపురంలో మంగళవారం సర్వే పరిశీలిస్తున్న తహసీల్దారు వెంకటరమణ

ఉంగుటూరు: నారాయణపురం వంతెన నిర్మాణ పనులు నేపథ్యంలో మంగళవారం సర్వే చేశారు. వంతెన వద్ద నుంచి దిగువ వరకు సర్వే నిర్వహించారు. ఏలూరు కాలువకు సంబంధించిన ఇరిగేషన్ స్థలం, ఆర్అండ్‌బీ స్థలం విస్తీర్ణాన్ని గుర్తించారు. ఈ సర్వే పనులు రెండు మూడు రోజులు సాగనున్నాయి. ఆర్అండ్‌బీ ఏఈ భాస్కరరావు, ఏలూరు డీఈ సాయిమోహన్‌కుమార్, తహసీల్దారు వెంకటరమణ, సర్వేయర్ శ్రీనివాసరావు, సచివాలయ కార్యదర్శి నాగేశ్వరరావు, ఇరిగేషన్ అధికార్లు పాల్గొన్నారు. సర్వే పనులు ప్రారంభించడంతో ఇంతకు ముందు నుంచి ఇరిగేషన్, ఆర్అండ్‌బీ స్థలాలు ఉన్న వారిలో కలవరం మొదలైంది.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

పెదవేగి : అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న పదిహేను మందిని అరెస్టు చేసి నాలుగు ఆటోలను పెదవేగి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పెదవేగి ఎస్సై ఎం లక్ష్మణ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం విజయరాయి శివారు బలివే నుంచి తాడేపల్లిగూడెంకు నాలుగు ఆటోల్లో, 78 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా మంగళవారం రాత్రి విజయరాయి పరిసర ప్రాంతాల్లో విజిలెన్స్ అధికారులు తనిఖీ చేయగా రేషన్ బియ్యం తరలిస్తున్న ముఠా గుట్టురట్టయ్యింది. దీనిపై పెదవేగి ఎస్సై ఎం లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రక్తహీనతతో ఆరోగ్య సమస్యలు



గర్భిణులకు రక్తపరీక్షలు వేస్తున్న వైద్యసిబ్బంది

గణపవరం: రక్తహీనతతో అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయని, తలనొప్పి, శ్వాస సంబంధిత వ్యాధులు, తీవ్ర అలసట వల్ల ఆరోగ్యపరమైన సమస్యలు ఎదుర్కోవలసి వస్తుందని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారులు సంతోష్ నాయుడు, కిరణ్మయి అన్నారు. మంగళవారం గణపవరం పీహెచ్‌సీలో గర్భిణులకు రక్త పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్త హీనత వల్ల వచ్చే అనారోగ్య సమస్యలను వివరించారు. క్రమం తప్పకుండా ఐరన్ మాత్రలు, ఎక్కువగా ఆకుకూరలు, పండ్లు, డ్రైఫ్రూట్స్ వంటివి తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో అందించే సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో జాలాది విల్సన్, పీహెచ్ఎన్ వరలక్ష్మి, ఆరోగ్య సహాయకుడు యోహాన్, హెచ్‌వి పద్మరాగం, ఆప్తాలమిక్ అసిస్టెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రాల సేవలు అమోఘం



పోలసానిపల్లి ఆర్‌బీకేను సందర్శించిన ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం డీన్ రాజ్‌నాయక్, ప్రొఫెసర్, శాస్త్రవేత్త

భీమడోలు: రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అందుతున్న సేవలు అమోఘమని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ చవన్ శ్యామ్ రాజ్ నాయక్ అన్నారు. పోలసానిపల్లికి విశ్వవిద్యాలయం నుంచి పని అనుభవం కార్యక్రమానికి విచ్చేసిన వ్యవసాయ కళాశాల విద్యార్థుల పనితీరును మంగళవారం అసోసియేట్ ప్రొఫెసర్ పి.అమ్మాజీ, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త ఎస్.నాగేంద్రబాబుతో కలిసి ఆయన పరిశీలించారు. విద్యార్థులకు నిర్దేశించిన పని పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించి పలు సూచనలందించారు. పోలసానిపల్లి రైతు భరోసా కేంద్రాన్ని వారు సందర్శించి నిర్వహణ తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసారు. దాళ్వా సీజన్‌లో వరి పంటకు వచ్చే తెగుళ్లు వాటిని నివారణకు రైతులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, యాజమాన్య పద్ధతులను వివరించాలని వ్యవసాయ కళాశాల విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వీఏఏ శాంతిప్రియ, విద్యార్థులు బి.నాగరాజు, ఎం.శివ, సీహెచ్ పృథ్వీరాజ్, పి.స్వామి, కె.మధుసూధన్, రైతులు పాల్గొన్నారు.

తెలుగుభాష ఔన్నత్యాన్ని చాటి చెప్పాలి



కొవ్వలి ఉన్నత పాఠశాలలో తెలుగు తల్లి చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న హెచ్ఎం శర్మ



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ విశ్వేశ్వరరావు

దెందులూరు: తెలుగుభాష దినోత్సవ వేడుకలు మంగళవారం కొవ్వలి ఉన్నత పాఠశాల, దెందులూరు ఉన్నత పాఠశాల, పోతునూరు ఉన్నత పాఠశాల, మేధినరావుపాలెం ఉన్నత పాఠశాల, దెందులూరు నర్సింగ్ కాలేజీల్లో ఘనంగా నిర్వహించారు. తొలుత కొవ్వలి ఉన్నత పాఠశాలలో తెలుగుతల్లి చిత్రపటానికి హెచ్ఎం జీవీఎస్ఎస్ఎల్ శర్మ, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగుభాష ఔన్నత్యాన్ని భవిష్యత్తు తరాలకు చాటి చెప్పాలని వివరించారు. నర్సింగ్ కళాశాలలో కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు ఆధ్వర్యంలో విద్యార్థులు అక్షరాలను విడివిడిగా ఫ్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు.

తెలుగు భాష చాలా గొప్పది

ఉంగుటూరు: అన్ని భాషల కంటే తెలుగు భాష చాలా గొప్పదని పలువురు వక్తలు అన్నారు. నారాయణపురం ఎస్ఎఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ టీకే విశ్వేశ్వరరావు మాట్లాడుతూ భావ వ్యక్తీకరణ, ఆలోచన శక్తికి ఆలవాలం మాతృభాష అని అన్నారు. తెలుగుశాఖ అధ్యక్షుడు డా. కొండారవి మాట్లాడుతూ మాతృభాషలో ప్రావీణ్యం సంపాదించడం ద్వారా ఆలోచన శక్తి, మేధో శక్తి మెరుగుపడుతుందని అన్నారు. ముఖ్యఅతిథి జంగారెడ్డిగూడెం ఛత్రపతి శివాజీ కళాశాల తెలుగు అధ్యాపకులు డా. వెంకటలాల్, అధ్యాపకులు రెడ్డయ్య, బీవీ వెంకటేశ్వర్లు, బి. రాజు, ఎం.భాస్కరావు, కె. ఉమాశంకర్ పలు అంశాలు వివరించారు. వ్యాసరచన, వక్తృత్వం పోటీల్లో విజేతలైన మాలతీ, సుష్మ, రాజేష్ బహుమతులు అందుకున్నారు. ఉప్పాకపాడు ప్రాథమిక పాఠశాలలో అంతర్జాతీయ తెలుగుభాషా దినోత్సవాన్ని హెచ్ఎం అల్లు శ్రీను ఆధ్వర్యంలో నిర్వహించారు.

పెద్దింట్లమ్మవారి ఉత్సవాలు ప్రారంభం

దెందులూరు: దెందులూరులోని పెద్దింట్లమ్మవారి 44వ తీర్థ మహోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఉదయం పెద్దింట్లమ్మ భక్త బృందం అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో విశేషాలంకరణ చేశారు. ప్రత్యేక పూజ అనంతరం కలశ స్థాపన చేశారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారి తీర్థ మహోత్సవాల్లో పాల్గొన్నారు.

గృహ సారథులే పార్టీకి రథసారథులు

- ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు
- సచివాలయాల గృహసారథులకు శిక్షణ



పెదనింద్రకొలనులో గృహ సారథుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

నిడమర్రు: గృహ సారథులే వైఎస్సార్ కాంగ్రెస్‌కు రథసారథులని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. మంగళవారం తోకలపల్లి, పత్తేపురం, దేవరగోపవరం, పెదనింద్రకొలను, మందలపర్రు, నిడమర్రు గ్రామ సచివాలయాల పరిధిలో వేదికలు ఏర్పాటు చేసిన గృహసారథులకు శిక్షణ తరగులు నిర్వహించారు. ఈ సమావేశానికి జగనన్న గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ నౌడు అచ్యుతరామారావు అధ్యక్షత వహించారు. ఈ శిక్షణ తరగతులకు హాజరైన ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ పార్టీ తరఫున నియమించిన గృహ సారథుల పని తీరు బట్టి భవిష్యత్‌లో వారికి ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేస్తూ ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అందించే సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు పూర్తిస్థాయిలో ప్రజలకు చేరువ చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన మరో వ్యవస్థనే గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులని అన్నారు. ప్రభుత్వ వ్యవస్థలో వారు భాగస్వాములై గ్రామ వలంటీర్లను సమన్వయం చేసుకుంటూ సంక్షేమ పథకాలకు అర్హులను గుర్తించేందుకు ప్రతి గృహ సారథి కృషి చేయాలన్నారు.

క్షేత్రస్థాయి సమస్యలపై దృష్టి

వచ్చే ఎన్నికల్లో నూరుశాతం ఫలితాలు సాధించేలా ఇప్పటి నుంచే క్షేత్ర స్థాయిలో గృహసారథుల దృష్టికి వచ్చిన సమస్యలను పార్టీ పెద్దలకు, స్థానిక ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే వాసుబాబు సూచించారు. ఈ సమావేశాల్లో ఉంగుటూరు నియోజకవర్గం పరిశీలకులు వేంద్ర వెంకట స్వామి, జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు వెజ్జు వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ కోడే కాశి, వైఎస్ ఎంపీపీ బండిరమణ విస్సాకు, సర్పంచ్‌లు పుప్పాల మెహర్‌కుమార్, ఓగిరాల ప్రభాకరరావు, పొట్నూరి ఉమా, ముగ్గళ్ల యాకోబు ఆయా గ్రామాల ఎంపీటీసీలు, వైసీపీ నేతలుమద్రిపూడి రత్నకుమారి, దూసనపూడి సత్యనారాయణ, ముదునూరి త్రివేణి, త్రిమూర్తిరాజు, బొక్క వెంకటలక్ష్మి, చినిమిల్లి మూర్తి, సందీప్, అప్పలరాజు, గోవిందరాజు, కోడూరి రాంబాబు, బలే నల్లకొండలు, ఇసుకపాటి నాగేంద్ర, ఓగిరాల దావీదు, మద్దిరాల బుజ్జి, గుడిసే జాన్, గాదే నాగేశ్వరరావు, ప్రసాద్ తదితరున్నారు.

కార్యదర్శి, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిపై సర్పంచ్ ఫిర్యాదు

పెదవేగి: తనకు అవగాహన కల్పించకుండా కొన్ని బిల్లులపై తనతో వేలిముద్రలు వేయించుకునిపంచాయతీ కార్యదర్శి, ఔట్ సోర్సింగ్ ఉద్యోగి పంచాయతీ నిధులు స్వాహా చేశారని అమ్మపాలెం సర్పంచ్ దేవరపల్లి ఏసు మరియమ్మ మంగళవారం ఎంపీడీఓకు ఫిర్యాదు చేసింది. పెదవేగి మండలంలో అమ్మపాలెం గ్రామ కార్యదర్శి కిషోర్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగి వల్లీ ఇద్దరూ కలిసి రూ.1.6 లక్షలకు చెందిన బిల్లులపై ఇటీవల వేలిముద్రలు వేయించుకున్నారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. సర్పంచ్ ఫిర్యాదు మేరకు ఎంపీడీఓ రాజ్‌మనోజ్ ఈఓపీఆర్‌డీ శ్రీనివాస్‌ను విచారణ నిర్వహించమని ఆదేశించారు. విచారణ నివేదికను జిల్లా పంచాయతీ అధికారికి పంపుతామని ఎంపీడీఓ తెలిపారు.

డ్రెయినేజీ సమస్య పరిష్కారం

దెందులూరు: స్థానిక గౌడవీధి, గిరిజన వీధిలో దశాబ్దాల నాటి డ్రెయిన్ సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరికి రుణపడి ఉంటామని వైఎస్సార్ సీపీ దెందులూరు గ్రామ అధ్యక్షుడు పోకల రాంబాబు, సొసైటీ చైర్మన్ కొలుసు గణపతిరావు, మండల జగనన్న సచివాలయాల కన్వీనర్ కట్టా ఏసుబాబు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు కట్టా వెంకట సుబ్బారావు అన్నారు. మంగళవారం గౌడవీధి, గిరిజన వీధుల్లోని డ్రెయినేజీ సమస్యను వైఎస్సార్ సీపీ నాయకులు పరిశీలించారు. గత మండల సర్వసభ్య సమావేశంలో మండల కన్వీనర్ ఏసుబాబు, ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. రెండు వార్డుల్లో పందుల వల్ల మురుగునీరు రోడ్లు పైకి రావడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని వివరించి వినతిపత్రం అందజేశారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి డ్రైనేజీ సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా గౌడ, గిరిజన వీధుల ప్రజలు వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజలకు సుపరిపాలన అందించాలి



భీమడోలులో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

భీమడోలు: గ్రామాభివృద్ధిలో ప్రజాప్రతినిధులు తమ వంతు పాత్ర పోషించి ప్రజలకు సుపరిపాలన అందించాలని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. భీమడోలు గ్రామ పంచాయతీ రెండేళ్లలో చేసిన అభివృద్ధి పనులపై రూపొందించిన న్యూ ఇయర్ క్యాలెండర్‌ను సోమవారం రాత్రి భువనపల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వాసుబాబు ఆవిష్కరించారు. పంచాయతీ సర్పంచ్ పాము సునీతామాన్‌సింగ్ ఆధ్వర్యంలో పాలకవర్గం రెండేళ్లుగా గ్రామంలో పలు అభివృద్ధి పనులు పూర్తి చేయడంతో వారిని ఎమ్మెల్యే అభినందించారు. భీమడోలు, ఉంగుటూరు మండలాల కన్వీనర్లు రావిపాటి సత్యశ్రీనివాస్, మరడ వెంకట మంగారావు, నియోజకవర్గ జగన్‌సేవాదళ్ కన్వీనర్ తుమ్మగుంట భవానీ రంగా, సొసైటీ అధ్యక్షుడు ఎలిశెట్టి పాపారావుబాబ్జి, చైతన్య యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు పాము మాన్‌సింగ్, రాష్ట్ర కార్యదర్శి ఎం.జాన్సన్,చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు గోలి సుబ్బారావు, ఎంపీటీసీలు గంటా శ్రీనివాస్, ఇంజేటి జూనియర్, ఆజామ్, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, మద్దాల అప్పారావు, రామిశెట్టి శ్రీను పాల్గొన్నారు.

సేంద్రియ సాగుపై మొగ్గు చూపాలి

దెందులూరు: రైతులు వ్యవసాయ శాఖ సూచనలు, సలహాలు పాటిస్తూ సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని ఆచార్య ఎంజీ రంగా విశ్వవిద్యాలయం (రాజమండ్రి) అసోసియేట్ డీన్ డాక్టర్ చావన్ శ్యామ్ రాజ్‌నాయక్ అన్నారు. మంగళవారం దెందులూరులో వ్యవసాయ కళాశాల రాజమండ్రి శిక్షణ విద్యార్థులు ఆరుగురితో కలిసి పొలంబడి, వ్యవసాయ క్షేత్ర ప్రదర్శనలో ఆయన పాల్గొన్నారు. రైతులంతా భూసార పరిరక్షణ, ఎరువులు, పురుగు మందులు అవసరం మేరకే వాడకం, సంతృప్తికరమైన దిగుబడుల లక్ష్యసాధన, సేంద్రియ పద్ధతులపై ప్రొఫెసర్ డాక్టర్ టీ. అమ్మాజీ, ఏరువాక సెంటర్ సైంటిస్టు నాగేంద్రబాబు రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం పని అనుభవ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాలలో శిక్షణ పొందుతూ దెందులూరు వచ్చిన ఆరుగురు విద్యార్థులు జీవన ఎరువులపై క్షేత్ర ప్రదర్శన, పొలం బడి నిర్వహించారు. విద్యార్థుల శిక్షణ కార్యక్రమాలపై డీన్, మండల ఏఓ రమేష్ సంతృప్తి వ్యక్తం చేశారు.

నేటి నుంచి శ్రమకాల దీక్షలు

దెందులూరు: క్రైస్తవులు బుధవారం నుంచి 40 రోజులు పాటు శ్రమకాల దీక్షలు పాటిస్తారు. జిల్లాలో 1.10 లక్షల మందికిపైగా అన్ని విభాగాల క్రైస్తవ విభాగాల్లో ఈ దీక్షలను స్వీకరిస్తారు. క్రీస్తు శ్రమలను గుర్తు చేసుకుంటూ ఆధ్యాత్మిక జీవితంలో నూతన మార్పు కోసం 40 రోజులు పాటు ఈ దీక్షలు చేస్తారు. చర్చి పాస్టర్లు దీక్షల సందర్భంగా బుధవారం మెడలో జపమాల వేసి ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. అప్పటి ఏలూరు ఆర్‌సీఎం పీఠాధిపతి జాన్ ములగాడ ప్రోత్సాహం, ప్రణాళికతో పశ్చిమగోదావరి జిల్లాలోని భీమవరంలోని వేంపాడులోని చర్చి ఫాదర్ మైఖేల్ 1992లో శ్రమ కాల దీక్షలను ఏడుగురుతో ప్రారంభించారు. ఆధ్యాత్మిక అభివృద్ధికి ఈ దీక్షలు మార్గమని ఆర్‌సీఎం ఏలూరు పీఠాధిపతి డాక్టర్ పొలిమేర జయరావు అన్నారు. దీక్షాదారుల సంఖ్య పెరగడం సంతోషంగా ఉందని ఏలూరులోని పారీస్ క్రిస్ట్ కెథ్రడల్ చర్చి ఫాదర్ ఐ.మైఖేల్ అన్నారు. శ్రమ కాల దీక్షలతో ప్రతి ఒక్కరూ మెరుగైన జీవన విధానం పొందవచ్చని తెలిపారు.

ప్రతిపక్షాల అసత్య ప్రచారాలను తిప్పికొట్టండి



కలపర్రులో వలంటీర్లు, గృహసారథుల సమ్మేళనంలో ప్రసంగిస్తున్న దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

పెదపాడు: దెందులూరు నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి చెప్పారు. కలపర్రులో వలంటీర్లు, గృహసారథులతో సచివాలయ కన్వీనర్లకు జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంపై మంగళవారం దిశా నిర్దేశం చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మార్చి 18నుంచి 25 వరకు ఈ వారం రోజుల పాటు ఇంటింటికీ గృహ సారథులు వెళ్లి ప్రభుత్వం అందించే పథకాలను వివరిస్తూ మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం ద్వారా ప్రజలకు వివరించాలన్నారు. పార్టీ బలోపేతం అయ్యేందుకు గృహసారథులు కృషి చేయాలన్నారు. సంక్షేమ పథకాలు అందించే సమయంలో వలంటీర్లతోపాటు గృహసారథులు, నాయకులు ప్రజలకు వద్దకు వెళ్లి లబ్ధిదారులకు సీఎం జగనన్న కృషిని వివరించాలన్నారు. టీడీపీ అసత్య ఆరోపణలను తిప్పికొట్టాల్సిన బాధ్యత వలంటీర్లు, గృహసారథులపై ఉందన్నారు. సీఎం జగన్ ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల వ్యవస్థ ద్వారా ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. ఎల్లో మీడియా నిజాలు చెప్పకుండా అబద్దాలు వండి వార్చి ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తోందన్నారు. ఈ విషయాలను వలంటీర్లు, గృహసారథులు గ్రహించి, వాస్తవాలను ప్రజలకు వివరించాలన్నారు. నియోజకవర్గంలో 114 రోజుల పాటు గడపగడపకు వెళ్లి 30వేల కుటుంబాలను కలిసినట్టు తెలిపారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. ముఖ్యమంత్రి జగన్ పిలుపు మేరకు రాజకీయాల్లోకి వచ్చానని, ఊపిరి ఉన్నంతవరకు ప్రజా సేవకు అంకితమవుతానని ఎమ్మెల్యే కొఠారు అన్నారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న నియోజకవర్గ పరిశీలకుడు గుబ్బల తమ్మయ్య మాట్లాడుతూ నియోజకవర్గంలో 10వేల మందికి ఇళ్ల స్థలాలు అందించిన ఘనత అబ్బయ్య చౌదరికే దక్కుతుందన్నారు. నర్సాపురం నియోజకవర్గ పరిశీలకుడు ఘంటా ప్రసాదరావు, జిల్లా రైతువిభాగం అధ్యక్షుడు ఆళ్ల సతీష్‌చౌదరి, మండల కన్వీనర్ అప్పన ప్రసాద్, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ అక్కినేని గోపీ చంద్రదుర్గాప్రసాద్, గోగుంట సొసైటీ అధ్యక్షుడు భావరాజు సత్యన్నారాయణ, పెదపాడు సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్, ఎంపీపీ బత్తుల రత్నకుమారి, జెడ్పీటీసీ ఘంటా పద్మశ్రీప్రసాదరావు, రాష్ట్ర హస్తకళల కార్పొరేషన్ డైరక్టరు ముదుగురు సూర్యనారాయణ, విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ డైరక్టరు కత్తుల రవికుమార్, ఎంపీటీసీ కంభాల నాగరాజు పలు అంశాలు వివరించారు. ఈ కార్యక్రమంలో దెందులూరు మండల కన్వీనర్ కామిరెడ్డి నాని, మండల ఉపాధ్యక్షురాలు అప్పన పద్మావతి, సర్పంచ్‌లు వట్రపు విష్ణుతులసి కోటిరెడ్డి, చిన్నాల ఝాన్సీ గుజ్జుల రత్నకుమారి, చోడగిరి రామకృష్ణ, మరీదు రెడ్డియ్య, ఎంపీటీసీలు వీరంకి బుజ్జి, మాగంటి ఆదిలక్ష్మి, త్సవలం కనక దుర్గ, పెరుమాళ్ల అరుణ కుమారి, జెట్రిపోతుల మరియమ్మ, బుద్దే రామసీత, రాజులపాటి నాగమల్లేశ్వరావు, వట్రపు కోటిరెడ్డి, బెజవాడ శిరీషా, సాధం కిశోర్, చిన్నం వెంకటేశ్వరరావు, బోదవరపు వెంకటేశ్వరరెడ్డి డీవీ సుబ్బారావు పాల్గొన్నారు.